హ్యాట్రిక్‌తో దూసుకెళ్తా..



సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఐదు డివిజన్లలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్పొరేటర్ హేమ యాక్టివా నడపగా పద్మారావుగౌడ్ వెనక కూర్చుని తనకు ఓటేయాలని కోరారు. హ్యాట్రిక్ సాధించి చరిత్ర సృష్టిస్తానని పద్మారావు ధీమా వ్యక్తం చేశారు. –చిలకలగూడ

జనమంతా మా వెంటే!



సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల మీదుగా కొనసాగిన ర్యాలీలో భారీగా జనం తరలివచ్చారు. నియోజకవర్గవాసులంతా తన వెంటే ఉన్నారని విజయం సాధిస్తా అన్నారు. – సనత్‌నగర్

6 హామీలు అమలుచేస్తాం



సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమకు మద్దతుగా రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రచారం నిర్వహించారు. నీతి, నిజాయితీగా రాజకీయాలు చేసేందుకు వచ్చిన తనకు ఒక అవకాశం కల్పించాలని అధికారంలోకి రాగానే కచ్చితంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. –రాంగోపాల్‌పేట్

విజయ గంట మోగిస్తా



బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో మంగళవారం గన్‌రాక్ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన సమావేశంలో కాలనీవాసులు పాల్గొని బీజేపీ అభ్యర్థి శ్రీగణేష్‌కి మద్దతు తెలిపారు. కంటోన్మెంట్‌లో విజయగంట మోగిస్తానని ఈ సందర్భంగా శ్రీగణేష్ పేర్కొన్నారు. – రసూల్‌పురా

కమలాన్ని గుర్తించుకోండి



సనత్‌నగర్ బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి భారీబైకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారం చేశారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం బీజేపీ లక్ష్యమని యువత ఉద్యోగాల కల్పనకు తమ పార్టీ పెద్దపీట వేస్తోందంటూ కమలాన్ని గుర్తించుకోవాలన్నారు. –సనత్‌నగర్

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి ఎన్. శ్రీగణేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోండా డివిజన్ అంబేడ్కర్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీగణేశ్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సహకారం అందించలేదని స్థానికంగా వసూలయ్యే పన్నులు, కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులతోనే ఇక్కడ అభివృద్ధి పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

బీఆర్ఎస్‌తోనే ముస్లింల అభ్యున్నతి



కంటోన్మెంట్: బీఆర్ఎస్‌తోనే మైనారిటీల అభివృద్ధి సాధ్యమని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) అన్నారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థితో కలిసి ఒకటో వార్డు పెన్షన్‌లైన్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ముస్లింలకు పలు సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. లాస్య నందితను గెలిపిస్తే అభివృద్ధి యథావిధిగా కొనసాగుతుందన్నారు. సదర్ ఇఫ్టర్ రహమాన్, అతావుల్లా షరీఫ్, ఖాదర్ బేగ్, షరీఫ్, తారిఖ్, ఇర్ఫాన్, ఇక్బాల్, శంషాద్, ఆరిఫ్, సమ్‌దానీ హనీఫ్, సాజిద్, అఖిల్ బాబా, మథీన్, సమీర్, అఫ్రాజ్ పాల్గొన్నారు.

కార్తీక వెలుగులు



సనత్‌నగర్: కార్తీకమాస పూజ కార్యక్రమాల్లో భాగంగా బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీదత్తసాయి ఆలయంలో విశేష పూజలు జరిపారు. భక్తులు శివలింగాకారంలో దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

సనత్‌నగర్‌లో గులాబీ విజయం ఖాయం

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గులాబీ జెండా విజయం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ సున్నంబట్టీ, అరుణ్‌జ్యోతి కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల ఆశీస్సులతో ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని చెప్పారు. ప్రచారంలో ప్రజల నుంచి వచ్చిన అనూహ్య స్పందన నేపథ్యంలో బీఆర్ఎస్‌కు బ్రహ్మాండమైన మెజారిటీ వస్తుందనే ధీమా వ్యక్తం చేశారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాల్లో సనత్‌నగర్‌లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తన విజయానికి సోపానాలుగా నిలుస్తాయన్నారు. కార్పొరేటర్ హేమలత, పవన్‌కుమార్ గౌడ్, ప్రేమ్‌కుమార్, వెంకటేశన్, అరుణ్ గౌడ్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

గెలుపు ఖాయం.. మెజార్టీపైనే దృష్టి

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గంలో తన గెలుపు ఖాయమైందని దృష్టి అంతా మెజారిటీపైనే అని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో సీతాఫల్‌మండిలో బైక్‌ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కృషితోపాటు అన్నివర్గాల ప్రజలు, కుల, మత సంఘాల మద్దతు తనకే ఉందన్నారు. సికింద్రాబాద్‌ను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని, హ్యాట్రిక్ విజయంతో సికింద్రాబాద్ చరిత్రను తిరగరాస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సామలహేమ, సునీత, శైలజ, ప్రసన్నలక్ష్మీ, నాయకులు కిషోర్, రామేశ్వర్, కిరణ్, త్రినేత్ర, శోభన్‌రెడ్డి, కరాటే రాజు, కంది నారాయణ, శ్రీనివాస్, పాగర్తి భువన్‌రావు, గరికపోగుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పద్మారావుగౌడ్

బీజేపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

సనత్‌నగర్: అన్ని వర్గాల ప్రజల సమన్యాయం బీజేపీ అధికారంతోనే సాధ్యమని ఆ పార్టీ సనత్‌నగర్ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ కా సాత్..సబ్ కా వికాస్ అన్నదే బీజేపీ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని యావత్ ప్రజానీకం గర్వించేలా అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో తాను బీజేపీ నుంచి పోటీ చేస్తున్నానని, అదే బాటలో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. ఉచిత విద్య, వైద్యం బీజేపీ లక్ష్యమన్నారు. యువత ఉద్యోగాల కల్పనకు బీజేపీ పెద్దపీట వేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సమన్యాయం కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి



రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలోని ప్రజలందరి సమన్యాయం అందించాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. సనత్‌నగర్ అభ్యర్థి కోట నీలిమకు మద్దతుగా నియోజకవర్గంలోని డీవీకాలనీలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ఆయన హాజరై మాట్లాడారు. కుటుంబ పాలనతో కేసీఆర్ కుటుంబానికి మాత్రమే న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికి ఒకే న్యాయం ఉంటుందన్నారు. కోట నీలిమా మాట్లాడుతూ నీతి, నిజాయితీగా రాజకీయాలు చేసేందుకు వచ్చిన తనకు ఒక అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. రాజస్థాన్ మంత్రి ప్రమోద్ మహాజన్, ఏఐసీసీ నాయకులు విశ్వనాథన్, అలోక్ శర్మ, పవన్‌ఖేరా డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలిస్తే కంటోన్మెంట్‌ను అమ్మేస్తారు'

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కంటోన్మెంట్‌ను కూడా అమ్మకానికి పెడతారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బీఎన్ శ్రీనివాస్ ఆరోపించారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భానుక మల్లికార్జున్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తండ్రి పదవిని అడ్డుపెట్టుకుని డబుల్ ఇళ్ల కేటాయింపులో లాస్య నందితకు డబ్బులు ఇచ్చి మోసపోయిన వారి ఉదంతాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయన్నారు. ఇటీవల తాము పూర్తి ఆధారాలతో సహా వీడియో విడుదల చేస్తే, బీఆర్ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారని ఆ వీడియో అబద్ధం అయితే తగిన విచారణ చేయించాలన్నారు.

'ఆ ఇద్దరు అవినీతికి చిరునామా'

రసూల్‌పు: కంటోన్మెంట్ బోర్డు ప్రస్తుత నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ, మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ కారణంగా బోర్డు పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని కోట్లాది రూపాయల అవినీతి జరుగుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముప్పిడి గోపాల్ ఆరోపించారు. మంగళవారం బాలంరాయిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకుడు శ్రీ గణేష్‌కి మద్దతిస్తున్న ఇద్దరు నేతలు అవినీతికి చిరునామా అని బీ–3 స్థలంలో 2003లో బాంటీయా గార్డెన్ నిర్వాహకులు అక్రమ నిర్మాణం చేపడితే అప్పటి బోర్డు నామినేటెడ్ సభ్యులు జంపన ప్రతాప్ అండగా నిలిచాడని, ఇటీవల కోర్టులో బోర్డు కేసు గెలిచినప్పటికి ప్రస్తుత సభ్యులు రామకృష్ణ వారికి అండగా నిలుస్తున్నారన్నారు. అదే విధంగా పైగా కాలనీలో అక్రమ నిర్మాణాలకు రామకృష్ణ అండగా ఉన్నాడని వీరి మాటలు విని బీజేపీకి ఓటు వేయరాదన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.